క్లుప్తంగా

విద్యార్థినికి మంత్రి అభినందన



కొల్లాపూర్: షూటింగ్ బాల్ పోటీలలో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థిని వి.దీపిక ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అభినందించారు. రూ.5వేల నగదును ప్రోత్సాహకంగా అందించారు. నార్లాపూర్ గ్రామానికి చెందిన దీపిక ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి జూనియర్ విభాగం షూటింగ్ పోటీలలో ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టు తరపున పాల్గొన్నది. దీపికను నవంబర్ 5 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అదేవిధంగా కోచర్ రిటైర్డ్ పీఈటీ బి.గోపాలంను మంత్రి అభినందించారు. ఎస్ఐ హృషికేష్, నార్లాపూర్ గ్రామ నాయకులు రామన్‌గౌడ్, చంద్రునాయక్, మాల వెంకటస్వామి, మున్నూరు నిరంజన్, జగపతిరావ్, దీపిక తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చారకొండ: మండలం శేరిఅప్పారెడ్డిపల్లి తూర్పు తండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోర్ర లక్ష్మణ్ నాయక్ శివలాల్ నాయక్, భగవాన్ వారితో పాటు తండా సీనియర్ నాయకులు 10 మందితో పాటు వారి కుటుంబ సభ్యులు బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అమన్‌గల్ మండలం ఖానాపూర్ స్వగృహంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు నాయకులు తెలిపారు. రామకృష్ణ రెడ్డి, నరేందర్ రెడ్డి, సురేష్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి

కొల్లాపూర్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో నర్సాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జంబుల భీమ్‌రెడ్డి తోపాటు పలువురు నాయకులు, తీర్నాంపల్లి గ్రామానికి చెందిన పలువురు ఉన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ధూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, సత్యం యాదవ్, కలమూరి నిరంజన్ తదితరులు ఉన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలని వినతి

తెలకపల్లి: రైతులకు నష్టపరిహారం చెల్లించాలని యువజన సంఘాల నాయకులు సాయిప్రభాస్ రెడ్డి, శివశంకర్‌లు కోరారు. బుధవారం తహసీల్దార్ జాకీర్ అలీకి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో సాగు చేస్తున్న వేల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటలు వర్షాలకు పాడయ్యాయని ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు చేసి పంటలు సాగు చేశారన్నారు. ఎకరాకు పది క్వింటాళ్లు రావలసిన పత్తి రెండు మూడు క్వింటాళ్లు కూడా రావడంలేదని పేర్కొన్నారు. రెడ్డపాకల శివశంకర్, అంకురి రాజు, ఇదమయ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పని సరి

కోడేరు: మండలంలోని ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని ఏపీడీ శ్రీనివాసులు ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం పస్పులలో ఉపాధి కూలీల ఈకేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15లోగా ఈకేవైసీ పూర్తి చేయాలని కోరారు. ఏపీఓ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరిలో దోమ నివారణకు చర్యలు

చారకొండ: వరి పంటలో ఆశించిన వరి దోమపోటు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో బుధవారం విస్తరణ అధికారి వంశీ వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలకు ఆశించిన వివిధ రకాల దోమలను గుర్తించారు. పంటల నష్టం రైతులకు వివరించారు. వాటి సంరక్షణకు, దోమ నివారణకు వడాల్సిన మందులను తెలిపి వటిని ఏ విధంగా పిచికారీ చేయాలో వివరించారు. పలు సూచనలు తెలిపారు. సిబ్బంది, రైతులు ఉన్నారు.

మొక్కలు నాటిన ఫారెస్టు అధికారులు

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ రేంజ్ పరిధిలోని మొలచింతపల్లి సెక్షన్ డొక్కల కుంట ఏరియాలో ఆక్రమణకు గురైన అటవీ భూమిలో రేంజర్ ఈశ్వర్ ఆధ్వర్యంలో 700 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రేంజర్ ఈశ్వర్ మాట్లాడుతూ అటవీ ఏరియాలో చెట్లు నరికితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు కాశన్న, ముజీబ్ గోరి, జయరాజ్, నీలేష్, శివ, మల్లేష్, భయన్న, బీట్ అధికారులు మహేష్, వల్య, నాగార్జున, లిఖిత, మాధవి, లక్ష్మణ్, బేస్‌క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యల తిష్ట

- వేధిస్తున్న గదుల కొరత
- మరుగుదొడ్లు లేక బాలికలు అవస్థలు



పెద్దకొత్తపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ కళాశాలలో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి పూర్తి విరుద్ధంగా ఉంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల సమస్యలకు నిలయంగా మారింది. పాఠాలు బోధించేందుకు అధ్యాపకులు కరువయ్యారు. అతిథి అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. గదుల కొరత విద్యార్థులకు శాపంగా మారింది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో 2 సంవత్సరాల కిందట ప్రారంభమైన ప్రభుత్వ ఇంటర్ కళాశాల ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లోనే 3 గదుల్లో కొనసాగుతోంది. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ కళాశాలల్లో 118 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలికలు 37, బాలురు 81 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు గదుల్లో మాత్రమే తరగతులు కొనసాగిస్తూ గతేడాది లెక్చరర్లు మంచి ఫలితాలు తీసుకరావడంతో ఈ సంవత్సరం 100 మంది విద్యార్థుల ఈ సంవత్సరం కళాశాలల్లో చేరారు. కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు గత నెల 24వ తేదీన జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ కళాశాల సమస్యలను జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకవెళ్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ప్రస్తుతం ఈ కళాశాలల్లో 9 మంది గెస్ట్ లెక్చరర్‌లు విద్యా బోధన చేస్తున్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన జయశంకర్ విగ్రహం పక్కన కళాశాల కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. నిధులు మంజూరు చేయకపోవడంతో భవన నిర్మాణం చేపట్టలేదు.

మూత్రశాలలు లేవు



కళాశాలలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు లేవు. పక్కనే ఉన్న ఉన్నత పాఠశాల మరుగుదొడ్లు, మూత్రశాలలను వాడుకుంటున్నాం. 37 మంది బాలికలు ఉన్నాం. నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలి.

– మౌనిక, ఎంపీసీ ప్రథమ సంవత్సరం

నిధులు మంజూరు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి. గ్రామ పంచాయతీ పరిధిలో కేటాయించిన 2 ఎకరాల స్థలంలో కళాశాల నూతన భవనం నిర్మించాలి. విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలి.

– మహేష్, సీఈసీ, ప్రథమ సంవత్సరం,

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వ కళాశాలకు స్వంత భవనం, ఆట స్థలం, మరుగుదొడ్ల నిర్మాణాలు, ల్యాబ్‌లు తదితర వసతుల కల్పన కోసం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు అయిన వెంటనే కళాశాలకు నూతన భవనం నిర్మించే అవకాశం ఉంది.

– రమేష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, పెద్దకొత్తపల్లి

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి



ప్లాట్‌లను చూయిస్తున్న ఎడ్మ సత్యం

కల్వకుర్తి రూరల్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.కోటి విలువ చేసే మున్సిపల్ ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాటిని వెంటనే రద్దుచేసి ప్రజల ఆస్తిని కాపాడాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం డిమాండ్ చేశారు. పట్టణంలోని సర్వేనెంబర్ 57/అ/2 లో 750 గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని విలేకరులకు వివరించారు. గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు వేసిన వెంచర్‌లో గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్లాట్లు వెంచర్ యజమాని పేరు పైనే ఉంటాయన్నారు. ఆ ప్లాట్ లను గుర్తించి మున్సిపల్ అధికారులు ఫెన్సింగ్ వేయాల్సి ఉందన్నారు. ఆ వెంచర్ లో ఫెన్సింగ్ చేసినప్పటికీ వెంచర్ యజమాని కుటుంబ సభ్యుల పేరుపై ఎల్ఆర్ఎస్ కట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన పట్టింపు లేకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసిన ఒకరిని కలెక్టర్ తొలగించగా ఇటీవల మరోసారి అతనిని మున్సిపల్ కార్యాలయంలో కీలక విభాగంలో నియమించారని తెలిపారు. కలెక్టర్ తొలగించిన వారిని మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకున్నారని ప్రశ్నించారు. వెంటనే అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ ను రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలతో పాటు చట్టపరంగా ముందుకు వెళ్తామని ఎడ్మ సత్యం తెలిపారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షాహేద్, మాజీ కౌన్సిలర్లు సూర్య ప్రకాష్ రావు, తాహెరాలి, శీను తో పాటు పలువురున్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

లింగాల: మండలంలోని వల్లభాపూర్, రాంపూర్, మానాజీపేట పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఎఫ్ఏ-2 మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని హెచ్ఎంలకు సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



సభ్యత్వం అందిస్తున్న శ్రీధర్ రావు

కల్వకుర్తి రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విద్యానగర్, సుభాష్ నగర్, హరిజనవాడ, బలరాం నగర్ ప్రాథమిక పాఠశాలలతో పాటు ఎల్లికల్ ఉన్నత పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలుపుకోవాలని ఉపాధ్యాయులకు అందవలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, మండల శాఖ ప్రతినిధులు జమీల్ అహ్మద్, శ్రీనివాసులు, ప్రసూన, శివానంద చారి తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

వెల్దండ: ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అసభ్యపదజాలంతో దూషించి దాడి చేసిన సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సీఐ తీరుకు నిరసనగా బుధవారం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దాపూర్‌లో ఈ నెల 4వ తేదీన దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కిషోర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో ఆ గ్రామ ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుడి గజ్జి హరిప్రసాద్ ఫిర్యాదుదారుడితో ఫ్లెక్సీ విషయంతో గొడవకు దిగాడు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందడంతో హరిప్రసాద్‌ను పోలీస్ స్టేషన్ పిలిపించారు. హరిప్రసాద్‌పై సీఐ చేయి చేసుకొని దుస్తులు విడిపించి సీఐ కార్యాలయంలో నిలబెట్టారని తెలుసుకొని బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సీఐకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి అదుపుతప్పకుండా వెల్దండ, వంగూర్ పోలీస్‌స్టేషన్‌ల నుంచి ఎస్ఐలతో పాటు సిబ్బంది వెల్దండకు చేరుకున్నారు. మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి వెల్దండకు చేరుకొని గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చేస్తున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డితో పాటు బాధితుడి హరిప్రసాద్‌ను శాంతింపజేశారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న సీఎంఓ ప్రతాప్‌రెడ్డి

పానగల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి సామర్థ్యాల పెంపే లక్ష్యంగా బోధన చేయాలని విద్యాశాఖ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ (సీఎంఓ) ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. పాఠశాలల్లోని భవిత సెంటర్ ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల సామర్థ్యాలు, భవిత సెంటర్ భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, వెంకటేష్, ఐఈఆర్పీ సంతోష్, స్పీచ్ థెరపిస్ట్ హరిశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఘన సన్మానం



అచ్చంపేట రూరల్: ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినులు జోషిక, సిరిలను బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ అభ్యుదయ సిండికేట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాలనీవాసులు విద్యార్థినులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో బాలస్వామి, వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, రజాక్, ఎండీ షబ్బీర్, బ్రహ్మేంద్రయాదవ్, అంజి, పాండు, రవీందర్, శివరాములు, జైపాల్, శ్రీను, నాగరాజు, మంజూర్, నర్సింహ, శేఖర్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండించిన కేవీపీఎస్

బిజినేపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ ఖండించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు సత్యనారాయణ, హనుమంతు, వెంకటయ్య, రాములు, సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్



కల్వకుర్తి రూరల్: తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కల్వకుర్తికి చెందిన భావండ్ల వెంకటేశ్ నియామకమయ్యారు. మంగళవారం రాత్రి హైదరాబాదులోని సంఘం కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు బుధవారం ఆయన విలేకరులకు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా షర్ఫుద్దీన్, కోశాధికారిగా బాలరాజు ఎంపికయ్యారని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటేష్‌ను అభినందించారు.

కీటకాల నివారణతో అధిక దిగుబడి



తిమ్మాజిపేట: కీటకాల నివారణతో అధిక దిగుబడి సాధించవచ్చని రావేఫ్ విద్యార్థులు పేర్కొన్నారు. వ్యవసాయ పంటలపై కీటకాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై మండలంలోని గొరిట గ్రామ సమీపంలో రాఘవచారి రైతు వ్యవసాయ పొలంలో బుధవారం వనపర్తి వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఫెరోమోన్ ట్రాప్స్ వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేయడం వల్ల కీటకాలు అందులో చిక్కుకుంటాయన్నారు. దీంతో పంట ఎక్కువగా హాని కలగకుండా ఉంటుందని వివరించారు. అదేవిధంగా అంటుకునే ఉచ్చులను ఏర్పాటు చేసుకోవడంతో పురుగులు వాటికి అత్తుకొని పంట నాశనం కాకుండా ఉంటుందని రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు హిమబిందు, ఝాన్సీరాణి, జానకి, అలేఖ్య, శిరిష, అశ్విని పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరిస్తునట్లు ఎంపీడీఓ చిన్నమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల్ పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయాలని కోరారు.

■ చారకొండ: మండలంలోని 6 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. మండల కేంద్రంలో రైతువేదికలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ శంకర్ నాయక్ తెలిపారు.

■ కల్వకుర్తి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ అభ్యర్థులు, మార్చాలా, జిల్లెల్ల, కురుమిద్ద ఎంపీటీసీ అభ్యర్థులు, అదేవిధంగా పంజుగుల, గుండూరు, రఘుపతి పేట ఎంపీటీసీ అభ్యర్థులు మండల విద్యాధికారి కార్యాలయంలో దాఖలు చేయాలని ఎంపీడీఓ తెలిపారు. తోటపల్లి, వేపూరు, సుధకల్ ఎంపీటీసీ అభ్యర్థులు ఉపాధి హామీ కార్యాలయంలో నామినేషన్ చేయాలని ఎంపీడీఓ వెల్లడించారు.

■ వెల్దండ: మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీటీసీ స్థానాల నామినేషన్ స్వీకరణకు 5 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



టీకాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రవికుమార్

వెల్దండ: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీఎంహెచ్ఓ రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్, కుప్పగండ్ల ఉప కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు టీకాలు ఎలా వేస్తున్నారో పరిశీలించారు. పిల్లల ఆరోగ్యంపై తల్లులు తగు జాగ్రతలను పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య శుభ్రతపై పలు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది మురళీకృష్ణ, మనోజ్, కవిత, ఆరోగ్య కార్యకర్తలు జానకి, గోవర్ధన్, ఆశకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కలెక్టర్, ఎస్పీ జంగమోనిపల్లి గ్రామాన్ని సందర్శించాలి



తెలకపల్లి: కలెక్టర్, ఎస్పీ జంగమోనిపల్లిని సందర్శించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాశన్న మాట్లాడుతూ గ్రామంలో దళితులను దుర్గామాత మండపం వద్దకు రాకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ గ్రామంలో గుడి ప్రవేశం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో శేఖర్ శ్రీశైలం శివ, చెన్నయ్య, రాములు, కృష్ణ, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీతాలను చెల్లించాలని ధర్నా



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలో వివిధ ఎస్సీ హాస్టల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల 8 నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. జీతాలు ఇవ్వకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదగిరి, నాగార్జున, హరిబాబు, రామస్వామి, బాబు కిరణ్, జానకి రాములు, అరుణ, నిరంజన్ పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: ఎస్సీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్, పార్ట్ టైం ఉద్యోగులకు వెంటనే జీతాలను చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్ట్ టైం ఉద్యోగులు, సబ్జెక్టు ఎక్స్‌పర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

వాగులోపడి వ్యక్తి మృతి



జంగయ్య(ఫైల్)

తాడూరు: మండలంలోని సిరసవాడ సమీపంలో ప్రవహిస్తున్న దుందుబీ వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జంగయ్య(50) మంగళవారం దుందుంబీ వాగులో నిర్మించిన చెక్‌డ్యామ్‌పై నడుచుకుంటు వెళ్తూ ప్రమాదవ శాత్తు కిందపడి మృతిచెందాడు. మరుసటి రోజు బుధవారం వాగులో శవమై తేలడంతో గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, ఆర్ఐ సల్మాన్‌లు సంఘటన స్థలాన్నీ పరిశీలించి, పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

లింగాల: మండలంలోని అవుసలికుంటలో విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పుట్ట మల్లయ్య సంబంధించిన కాడెద్దు గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలంలో మేత మేసుకుంటూ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మ దగ్గర ఎర్త్ వైర్ తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

చెంచులకు వైద్య పరీక్షలు

మన్ననూర్: పీఎం జన్‌మన్‌లో భాగంగా మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, జన్‌మన్ వైద్యుల సమక్షంలో మల్లాపూర్ చెంచుపెంటలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. అమ్రాబాద్ మండలంలోని అటవీ లోతట్టు ప్రాంతం మల్లాపూర్ పెంటలో చెంచులకు పరీక్షలు చేశారు. మొత్తం 25 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ మోహన్ పాల్ నాయక్, స్టాఫ్ నర్స్ కావ్య, ఎల్‌టీ రాజు, ఏఎన్ఎం పద్మ, అంజీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తిమ్మాజిపేట/కోడేరు/వెల్దండ: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బుధవారం పలు మండలాల్లో వాహనాలు తనిఖీ చేశారు. తిమ్మాజిపేట, కోడేరు, వెల్దండ ఎస్ఐలు హరిప్రసాద్‌రెడ్డి, జగదీష్, కురుమూర్తి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఉమెన్ ఏఎస్ఐ ప్రిసీల్లా, సిబ్బంది అశోక్, భాస్కర్‌యాదవ్, శివనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువులు వితరణ

మన్ననూర్: స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు బుధవారం రిటైర్డ్ డిప్యూటీ డీఎండీహెచ్ఓ డాక్టర్ వెంకటనారాయణ రూ. 1.50 లక్షలు విలువ చేసే ఆట వస్తువులు వితరణ చేశారు. డ్యూఎల్ డెస్కులు, రంగురత్నం, ఊయలలు, జారుడ బండ, తదితర ఆట వస్తువులను అమ్రాబాద్ మండల ఎంఈఓ బాలకిషన్, కాంప్లెక్స్ హెచ్ఎం సిద్దార్థ సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయురాలు శిల్పకు అందజేశారు. ఎఎపీఎస్ చైర్మన్ బక్కమ్మ, శ్రీధర్, కాలనీవాసులు బాలస్వామి, నీరంజన్, అంబనారాయణ, డాక్టర్ వెంకట్‌నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: ఒకరిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని మల్లోనిచెర్వుతండాలో బుధవారం 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు నాగమ్మ కిరాణం షాపులో తనిఖీ చేయగా సారా విక్రయిస్తునట్లు గుర్తించారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



బల్మూర్: మండలంలోని కొండనాగుల సింగిల్‌విండో కార్యాలయానికి ఎన్ఎంఈఓ-ఓఎస్ పథకం ద్వారా సరఫరా అయిన సర్టిఫైడ్ వేరుశనగ విత్తనాలను బుధవారం వ్యవసాయాశాఖ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కావేటి నరేష్ మాట్లాడుతూ మండలలానికి నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్‌సీడ్స్ (ఎన్ఎంఈఓ-ఓఎస్) పథకం ద్వారా 1350 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు సరఫరా అయ్యాయన్నారు. వందశాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీసీఎస్ సీఈఓ రాజవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

కల్వకుర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడడంతో పాటు ఆరు గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దివంగత కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి పేరు పెట్టి ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం, షాహెద్, సూర్య ప్రకాష్ రావు, విజితా రెడ్డి, మనోహర్ రెడ్డి, జంగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.